క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

వంగర: మండల పరిధి మడ్డువలస ప్రాజెక్టు ఆవరణలో వెలసిన షిర్డీసాయి ఆలయ 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు పసుమర్తి వెంకటరావు, వారణాసి అర్జునరావు ఆధ్వర్యంలో బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేడు పరదేశమ్మ సంబరం

బాడంగి: మండల కేంద్రం బాడంగిలోని పరదేశమ్మ పండుగ సంబరాలు మంగళవారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఘటాన్ని గ్రామంలోని గుడి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్తారు. సాయంత్రం గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. అనంతరం అనుపోత్సవం నిర్వహించనున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్చరణాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ ఉత్సవాలన్ని తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఏటా డోలా పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. తెర్లాంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద డోలాయాత్ర ఘనంగా నిర్వహించారు. స్వామివారిని గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించి పూజలు చేశారు.

దాడితల్లిని దర్శించుకున్న ఎంపీ బెల్లాన



దాడితల్లి అమ్మవారి సన్నిధిలో ఎంపీ బెల్లాన

బొబ్బిలి: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం గొల్లపల్లిలోని దాడితల్లి అమ్మవారిని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి ఆశీర్వచనాలు ఆయనకు అందజేశారు.


వైభవంగా డోలాయాత్ర



ఉత్తరముఖ మండపంలో పూజలందుకుంటున్న సీతారామస్వామి

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో డోలా పౌర్ణమి సందర్భంగా సోమవారం డోలాయాత్ర నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగాపురపు ప్రసాదరావు ఆధ్వర్యంలో స్వామివారిని సర్పవాహనం, ఆంజనేయవాహనం, పల్లకి సవ్వారిలపై ఆలయం నుంచి ఉత్తరముఖ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరిగి స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. డోలాయాత్రను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోడ్ ఉల్లంఘిస్తే కేసే..



అచ్చియ్యపేటలో పర్యటిస్తున్న అధికారులు

బాడంగి: సార్వత్రిక ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎన్నికల కోడ్ పర్యవేక్షణ అధికారి, ఎంపీడీఓ ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని రామచంద్రాపురం, కోడూరు, అచ్చియ్యపేట, బాడంగి గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కోడ్ పక్కాగా అమలు జరిగేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

పీహెచ్‌సీల్లో కార్పొరేట్ వైద్యం

- వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట
- అందుబాటులో అత్యాధునిక పరికరాలు
- ఆరోగ్య కేంద్రంలోనే 63 రకాల వైద్య పరీక్షలు



అత్యాధునిక ల్యాబ్

సంతకవిటి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. నాడు–నేడు కార్యక్రమం పీహెచ్‌సీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నిర్మించి గ్రామస్థాయిలోనే ప్రజలకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో పీహెచ్‌సీకి టిలీ, పీసీఆర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, సీబీసీ తదితర పరికరాలు ప్రభుత్వం అందజేసింది. గతంలో 15 రకాల వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా.. నేడు 63 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతానికి చెందిన రోగులు వైద్యం కోసం రాజాం, శ్రీకాకుళం పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు. ప్రస్తుతం పెద్దాసుపత్రిలో అందే వైద్య సేవలన్నీ పీహెచ్‌సీలోనే అందుతుండటంతో ఇక్కడకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.



సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రి ఆవరణలో 104 వాహనం

వైద్య పరీక్షలు

హెచ్‌బీ, బ్లడ్ గ్రూప్, హెచ్ఐవీ, హెచ్‌సీఎస్‌జీ, వీడీఆర్ఎల్, గల్ల పరీక్ష, ర్యాండం బ్లడ్ సుగర్, మలేరియా, డెంగీ, వైడల్, హెజ్‌సీవీ, యూరియా క్రియాటిన్, ప్లేట్లెట్ కౌంట్, ఎస్‌టీజీ, ఎస్‌జీపీటీ, ఏఎల్పీ, లిపిడ్ ప్రొఫైల్, పొటాషియం, సోడియం, క్లోరైడ్, యూరిన్ మైక్రోస్కోపిక్ వంటి 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

అత్యాధునిక వైద్య పరీక్షలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యాధునాక పరికరాలు అందుబాటులో ఉండడంతో పీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నాం. ప్రైవేట్ ల్యాబ్‌లలో వేల రూపాయిలు ఖర్చయ్యే పరీక్షలను ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం.

– బి.రవిచంద్ర, ల్యాబ్ టెక్నీషియన్, సంతకవిటి

గతం కన్నా నేడు ఎంతో నయం



గతంలో చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా రాజాం, శ్రీకాకుళం వంటి పట్టణాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇపుడు సంతకవిటి ఆస్పత్రిలోనే అన్ని రకాల జబ్బులకు డాక్టర్లు వైద్యం చేస్తున్నారు.

– బెవర అప్పలనాయుడు, జావాం

రోగుల అవస్థలు తీరాయి



గతంలో పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో పరికరాలు లేకపోవడంతో పరిమితంగా రక్తపరీక్షలు చేయాల్సి వచ్చేది. రోగులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో అన్ని రకాల పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అయిన తరువాత అవసరమైన వైద్యాన్ని అందిస్తున్నాం.

– యు.నాగేంద్రప్రసాద్, వైద్యాధికారి, సంతకవిటి పీహెచ్‌సీ

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



విజయపురిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోసూరువలస, చిన మోసూరువలస, ఎరకందొరవలస, డొంగురువలస, చిలకమ్మవలస, విజయపురి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తామంతా జగనన్నకే ఓటు వేస్తామని గిరిజనులంతా ముక్తకంఠంతో చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీసీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, మోసూరువలస సర్పంచ్ సూర్యారావు, గొర్లె సీతారాంపురం, ఎంపీటీసీ గొర్లె తిరుపతిరావు, గిరిజన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



తెర్లాం: కాగాంలో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ తిరుమలరావు, ఎస్సై రమేష్

తెర్లాం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు కోరారు. తెర్లాం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్సై బి.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మ, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి నిఘా పెట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పేర్కొన్నారు.

రాజాం సిటీ: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై వై.రవికిరణ్ కోరారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో సోమవారం పర్యటించారు. ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగం, ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన తప్పనిసరి



అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మెంటాడ: ఎన్నికల నియామావళిని ప్రజలందరూ తెలుసుకోవాలని, ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కలిగి ఉండాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన జక్కువ, పెద్ద మేడపల్లి, పెద్ద చామలాపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ప్రజలతో సమావేశమై ఎన్నికల ప్రవర్తన నియమావళి, కోడ్ ఉల్లంఘించే వారిపై చట్టపరంగా తీసుకునే చర్యలను వివరించారు. గొడవలకు పాల్పడేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై బి.దేవి ఉన్నారు.



రామభద్రపురం: హోలీ వేడుకల్లో చిన్నారులు



బొబ్బిలి: కృష్ణాపురంలో హోలీ సంబరాల్లో చిన్నారులు

సంతోషాల హోలీ

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ. ఈ రంగుల పండగను బొబ్బిలి, రాజాం నియోజకర్గాల ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. డోల పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి బొబ్బిలి, రాజాం



తెర్లాం: తెర్లాంలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు



సంతకవిటి: సంతకవిటిలో రంగులు చల్లుకుంటున్న యువత

ప్రజలు శాంతియుతంగా మెలగాలి

సంతకవిటి: ఎన్నికల సమయంలో ప్రజలు శాంతియుతంగా మెలగాలని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సోమవారం పర్యటించారు. ప్రజలతో సమావేశమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. గుంపులుగా తిరగరాదని, వివాదాస్పద వాఖ్యలు చేయొద్దని సూచించారు. సీ-విజల్, సువిద యాప్‌ల వినియోగాన్ని ప్రజలకు వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ శంఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

3 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి వీవీఆర్‌పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సారా విక్రయిస్తూ పట్టుబడినట్లు ఎస్సై వైవీ జనార్దన్ సోమవారం తెలిపారు. పట్టుబడిన వ్యక్తి దగ్గర 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

విజయ ఢంకా మోగిస్తూ..



తీన్‌మార్ డప్పును వాయిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: మున్సిపాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు తీన్‌మార్ డప్పులు, మేళతాళాలు, బాణసంచా శబ్దాల మధ్య ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని ఆలయాల్లో పార్టీ నాయకులతో కలిసి పూజలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ తలే రాజేష్ తీన్‌మార్ కంజార డప్పును వాయించి ఓటర్లను, కార్యకర్తలను అలరించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, సలాది తులసీరావు మాస్టారు, సలాది రామదాసు, సతీష్, శ్రీను, లెంక రమణ, బత్తుల యోగి, దొండపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించే యువ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడుతో కలిసి సోమవారం వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో పాటు జిల్లా యువజన కమిటీ సభ్యులు, నియోజకవర్గం, మండల ముఖ్య నాయుకులంతా హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు జెండా ఎగరవేసేందుకు యువత ఏకమవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, కటికి చిన్నారావు, సీనియర్ నాయకులు కనిమెరక అప్పారావు, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు, గణేష్, పోలినాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధే జగనన్న లక్ష్యం



వాసవీనగర్‌లో డాక్టర్ రాజేష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న కాలనీ పెద్దలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రాజాం పట్టణంలో వాసవీనగర్, బాబానగర్, గాంధీనగర్ వార్డుల్లో సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తును చూపిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం రాజాం పట్టణ అభివృద్ధిని గాలికొదిలేసిందని, అంతర్గత కలహాలు, కుమ్ములాటలతో పట్టణంలో ఒక్క రోడ్డు కూడా వేయలేకపోయారని దుయ్యబట్టారు. నీరు–చెట్టు నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి నిధులు కూడా దోచేశారని ఆరోపించారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు వచ్చేవికాదని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాజాం ప్రధాన రహదారి విస్తరణతో పాటు అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం జరిగిందన్నారు. అర్హులకు నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని అన్నారు. మంచి జరిగితేనే తమకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, శాసపు వేణుగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, దూబ గోపాలం, పాలవలస శ్యామ్‌చ కోరాడ రామినాయుడు, ఆర్.జయరాం, గోకవలస బాబూరావు, లావేటి రమేష్‌నాయుడు, హరి, నీలకంఠం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, అల్లెన జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చడం దారుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేద ప్రజలకు మేలు చేసిన వలంటీర్లను శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఉగ్రవాదులు, జీహాదీలు, స్లీపర్ సెల్స్‌తో పోల్చుతూ అవమానించడం దారుణమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. వలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. అందుకే వారిని కించపరిచేలా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదులకు మాత్రమే ఇలాంటి ఆలోచనలు వస్తాయని మండిపడ్డారు. వలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు, డర్రు పైడిరాజు తదితరులు ఉన్నారు.


జగనన్న మళ్లీ సీఎం కావాలని పూజలు



రాజాం: కోదండరామ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తలే రాజేష్, తదితరులు

రాజాం/రేగిడి: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రేగిడి మండలం వన్నలి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య ప్రత్యేక పూజలు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించాలని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రార్థిస్తూ స్వామివారికి కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. వారి వెంట రాజాం పట్టణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, రేగిడి వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు గార రమణ, కరణం శ్రీనివాసరావు, కెంబూరీ వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు మండపాధిష్ఠాన దేవతలకు పూజలు, సుప్రభాత సేవ, శేషహోమాలు, పూర్ణాహుతి, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మేలన, తేనె దర్శనం, సర్వదర్శనం, తదితర పూజా కార్యక్రమాలతో పాటు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఖండ్యాం గ్రామానికి చెందిన శారదపీఠం వ్యవస్థాపకులు అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో అంపోలు రామప్రసాద్ శర్మ పర్యవేక్షణలో 11 మంది రుత్వికులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. సర్పంచ్ గార రమణ, డీలర్లు సంఘం అధ్యక్షుడు సింగంవలస రామ్మూర్తినాయుడు, ఈఐడీ ప్యారీ ఏవీపీ పట్టాభి రామిరెడ్డి, డీజీఎం కేస్ రాజేంద్రన్, హెచ్ఆర్డీ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. రామభద్రపురం మండలం శిష్టు సీతారాంపురం గ్రామంలో టీడీపీకి చెందిన 15 కుటుంబాలు సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత టీడీపీ నాయకుల మాటలు భరించలేకే వైఎస్సార్‌సీపీలో ప్రజలు చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన కుంద సూర్యనారాయణ, చేపల లక్ష్మణ, ముదిలి పోలారావు, ముదిలి పైడితల్లి, శిష్టి సురేష్, తాడ్డి తిరుపతి, శిష్టు వెంకటి తదితరులు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు నచ్చి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు చెప్పారు. గొల్లలపేట ఎంపీటీసీ శిష్టు గౌరినాయుడు ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరినట్టు పార్టీ నాయకుడు కర్రోతు అశోక్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌ఛార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.